# మజ్లిసె శూరా ప్రాముఖ్యత, శూరా సభ్యులు, జమాఅత్ పదవిదారుల బాధ్యతలు

Majlis e Shura Ki Ahmiyat Aur Membaran e Shura Wa Uhdedarane Jama'at Ki Zimmadariyan

మజ్లిసె శూరా భారత్

# మజ్లిసె శూరా ప్రాముఖ్యత, శూరా సభ్యులు, జమాఅత్ పదవిదారుల బాధ్యతలు

ఖుత్బా జుమా: 12.5.2023

**హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్**

**అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్**

:అనువాదము:

ముహమ్మద్ అక్బర్ ముబల్లిఘ్

:ముద్రణ:

మజ్లిసె శూరా భారత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్యా ఖాదియాన్

مجلس شوریٰ کی اہمیت اور ممبران شوریٰ و عہدیداران جماعت کی ذمہ داریاں

పుస్తకం పేరు : మజ్లిసె శూరా ప్రాముఖ్యత, శూరా సభ్యులు, జమాఅత్ పదవిదారుల బాధ్యతలు

కూర్పు : హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

అనువాదము : ముహమ్మద్ అక్బర్ ముబల్లిఘ్

ముద్రణ : 2025

ప్రతులు : 300

ముద్రణాలయం : ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్

ప్రచురణ : నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ 143516, జిల్లా: గుర్దాస్‌పూర్, పంజాబ్, ఇండియా.

Name of Book : **Majlis-e-Shoora Praamukhyata, Shoora Sabhyulu, jama'at padavi daarula baadhyatalu**

Friday Sermon delivered by : Hazrat Mirza Masroor Ahmad Khalifatul Masih V

First Edition : 2025

Copies : 300

Telugu Translation : Muhammad Akbar Muballigh

Printed at : Fazl-e-Umar Printing Press Qadian

Published by : Majlis-e-Shoora Bharat Qadian, 143516, Dist: Gurdaspur Punjab, INDIA

**ఇతర వివరాలకు సంప్రదించగలరు**

**www.alislam.org**

**www.ahmadiyyamuslimjamaat.in**

# విషయ సూచిక


| క్ర.సం. | శీర్షికలు | పుట |
|---|---|---|
| 1. | తొలి పలుకులు | IV |
| 2. | ఖుత్బా జుమా | 1 |
| 3. | శూరా ప్రాధాన్యత-ప్రతినిధుల బాధ్యతలు | 2 |
| 4. | మజ్లిసె శూరా సలహాలు ఇచ్చును, తీర్మాణం కాదు | 4 |
| 5. | మహా ప్రవక్త స.అ.స అత్యధికంగా సలహాలు సేకరించేవారు | 5 |
| 6. | మహా ప్రవక్త స.అ.స. సలహాలు సేకరించే విధానాలు | 6 |
| 7. | మొదటి విధానం | 7 |
| 8. | రెండవ విధానం | 8 |
| 9. | మూడవ విధానం | 8 |
| 10. | హజ్రత్ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యెమెన్‌కు పంపుట | 9 |
| 11. | ప్రతినిధులు సదుద్దేశంతో సలహాలివ్వవలెను | 12 |
| 12. | ఖిలాఫత్ తర్వాత మజ్లిసె శూరా అత్యంత ప్రధానం | 15 |
| 13. | ప్రతినిధులు ప్రశాంతతను పాటించవలెను | 17 |
| 14. | ప్రతినిధుల కాల పరిమితి ఒక సంవత్సరం | 20 |
| 15. | ఒకే అభిప్రాయం పదే పదే రావడానికి గల కారణం! | 22 |
| 16. | క్రియాశీలకంగా పని చేయవలసిన అవసరం | 25 |
| 17. | హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అవతరణ ముఖ్యోద్దేశం | 26 |
| 18. | తక్కువ ఖర్చులో ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించడం | 26 |

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

# ముందుమాట

మజ్లిసె శూరా అనే వ్యవస్థ అహ్మదియ్యా జమాఅత్‌లో 1921 సం॥లో ప్రారంభమై ఇప్పటి వరకు విజయవంతంగా కొనసాగుతూ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు విస్తరించింది. కనుక మజ్లిసె శూరా ప్రాముఖ్యతతో పాటు మజ్లిసె శూరా ప్రతినిధులు, జమాఅత్ పదవిదారుల బాధ్యతల గురించి జమాఅత్ తెలుసుకోవలసిన అవసరమున్నది.

ఈ పుస్తకంలో సలహాలు, ప్రతిపాదనల సేకరణ ఆవశ్యకత, పవిత్ర ఖుర్ఆన్‌లో సలహాలు సేకరించు దైవాదేశమును హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ప్రస్తావించారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎలా సలహాలు సేకరించేవారో, అనంతరం ఖులఫాయె రాషిదీన్ ఎలా సున్నత్‌ను అనుసరించారో చాలా గొప్పగా వివరించనైనది. సభ్యుల అవగాహన నిమిత్తం ఈ ఖుత్బాను తెలుగులో ముద్రిస్తున్నాము. గౌ॥ ముహమ్మద్ అక్బర్ ముబల్లిఘ్ గారు (తెలుగు బద్ర్ ఉప సంపాదకులు) దీనిని తెలుగులో అనువదించగా గౌ॥ ముహమ్మద్ ఇస్మాయిల్ (కాట్రపల్లి) ముఅల్లిమ్ గారు, గౌ॥ ముహమ్మద్ సిరాజ్ ముబల్లిఘ్ ఇంచార్జి జిల్లా పశ్చిమ గోదావరి గారు పునఃపరిశీలించారు. తదనంతరం హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ ఇంచార్జ్ తెలుగు డెస్క్ గారు ప్రూఫ్ రీడింగ్, సెటింగ్ చేశారు. ఇందుకు సహకరించిన వారందరికి అల్లాహ్ తఆలా ఉత్తమ ప్రతిఫలము నొసంగు గాక! ఈ పుస్తకము అందరికి సన్మార్గము ప్రసాదించుగాక!

*అతాఉల్ ముజీబ్ లోన్*

*భారత మజ్లిసె శూరా కార్యదర్శి*

## ఖుత్బా జుమా సయ్యిద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్

**దివి:12 మే 2023- 12 హిజ్రత్ 1402 హిజ్రి షంసీ**
**మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె), యు.కె.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَ رَسُوْلُهٗ۔
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ﴿۱﴾
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿۲﴾ الرَّحْمٰنِ الرَّحِيْمِ ﴿۳﴾ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ﴿۴﴾
اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ ﴿۵﴾ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ﴿۶﴾
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ۵ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَ لَا الضَّآلِّيْنَ ﴿۷﴾

فَبِمَا رَحْمَةٍ مِّنَ اللّٰهِ لِنْتَ لَهُمْ ۚ وَلَوْ كُنْتَ فَظًّا غَلِيْظَ الْقَلْبِ
لَانْفَضُّوْا مِنْ حَوْلِكَ ۖ فَاعْفُ عَنْهُمْ وَاسْتَغْفِرْ لَهُمْ وَشَاوِرْهُمْ
فِي الْاَمْرِ ۚ فَاِذَا عَزَمْتَ فَتَوَكَّلْ عَلَى اللّٰهِ ؕ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُتَوَكِّلِيْنَ

(ఆలె ఇమ్రాన్: 3/160)

అనువాదం: అల్లాహ్ ప్రత్యేక కరుణ వలన మీరు వారి కోసం మృదు స్వభావులుగా మారిపోయారు. ఒకవేళ నీవు కఠిన మనస్థత్వం మరియు చీదరింపు వాడిగా మారిపోయినచో వారు తప్పకుండా నీ

నుండి పారిపోయేవారు. కావున నీవు వారిని మన్నించుము, వారి క్షమాపణల కోసం దుఆలు చేయుము. ప్రతి ముఖ్యమైన పనిని ప్రారంభించునప్పుడు వారి నుండి సలహాలు సేకరించుము. ఆ తరువాత నీవు ఏదేని తీర్మాణం చేసినచో ఇక అల్లాహ్ పైనే పూర్తి నమ్మకాన్ని కల్గియుండుము. నిశ్చయముగా నమ్మకాన్ని కల్గియుండువారిని అల్లాహ్ ప్రేమించును.

ప్రస్తుత రోజులలో అనేక దేశాలలో జమాఅత్ పరంగా మజ్లిసె శూరా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నవి. కొన్ని దేశాలలో ముగిసినవి. మరికొన్ని దేశాలలో ఈ వారంలో నిర్వహించబడును. మిగిలిన దేశాలలో వచ్చే వారంలో నిర్వహించబడును. నేటి నుండి జర్మనీలో మొదలవుతున్నవి. జర్మనీతో పాటు మరికొన్ని దేశాలలో కూడ నిర్వహించబడుతున్నవి. ఇదే విధంగా యు.కే. మజ్లిసె శూరా వచ్చే వారంలో నిర్వహించబడును. యు.కే. తోపాటు మరికొన్ని దేశాలలో కూడ వచ్చేవారమే నిర్వహించబడును.

**శూరా ప్రాధాన్యత-ప్రతినిధుల బాధ్యతలు:**

శూరా ప్రాధాన్యత మరియు జమాఅత్ ప్రతినిధుల బాధ్యతలను గూర్చి నేను గతంలోనే జుమా ప్రసంగాలలో సూచించాను. కాని ఇప్పటికి కొన్ని సంవత్సరాలు గడిచాయి కనుక నేడు మరల అల్లాహ్ తఆలా ఆదేశం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శం, జమాఅత్ సాంప్రదాయాలు, విధానాలు, పద్ధతి మొదలైన వాటిని గూర్చి ప్రస్తావించుట సముచితమని భావించాను. శూరా కార్యక్రమాలు నిర్వహించబడిన దేశాల ప్రతినిధులు కూడ శూరా సభ్యుల బాధ్యతలకు చెందిన ఈ అంశాల ద్వారా ప్రయోజనాన్ని పొందవచ్చును. శూరా

సభ్యులు గుర్తుంచు కోవలసిన విషయమేమనగా, మజ్లిసె శూరా ప్రతిపాదనలు పంపబడిన తర్వాత వాటిని వర్తమాన ఖలీఫా తీర్పు వెల్లడించిన తరువాతనే సభ్యుల బాధ్యతలు ప్రారంభమవుతాయి. కావున వాటిని నెరవేర్చడం మరియు తమ వంతు పాత్రలను పోషించడం ప్రతి శూరా సభ్యుని బాధ్యత.

మొత్తానికి ఆయా బాధ్యతలను గూర్చి ప్రస్తావించుటకు ముందు నేను పారాయణం చేసిన సూక్తి ఆధారంగా కొన్ని విషయాలను తెలుపదలిచాను. అంతేగాకుండా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శవంతమైన నడవడిక మరియు హుజూర్ (స) విధానాలను గూర్చి కూడ తెలియపర్చుతాను. అల్లాహ్ తఆలా యొక్క ప్రత్యేకమైన కరుణ వలన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ సమాజ సభ్యుల పట్ల మృదుస్వభావంను కల్గియుండిరి అనే విషయాన్ని బలపరచడంతో పాటు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కర్తవ్యాన్ని ముందుకు కొనసాగించు బాధ్యత కల్గినవారమైన మనం పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణుల ప్రకారం హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం శిష్యుడిగా అవతరించిన మసీహ్ మౌవూద్ (అ) మరియు మహ్దియే మౌవూద్ (అ) లక్ష్యాన్ని నెరవేర్చు బాధ్యతను కల్గియున్న మనం ఆ కర్తవ్యాన్ని కూడ ప్రేమానురాగాలతో మరియు మృదు స్వభావంతో పూర్తి చేయవలెననే విషయం వైపు అల్లాహ్ తఆలా మనకు శ్రద్ధను కల్పించాడు.

అల్లాహ్ తఆలా ఇలా తెలిపాడు. ఒకవేళ సున్నితత్వంతో మాట్లాడక పోయినచో, కఠినత్వంను ప్రదర్శించినచో, కోపగించుకున్నచో ఈ ప్రజలు దూరమైపోతారు. కావున అల్లాహ్ తఆలా వారి మన్ననల

కోసం మరియు క్షమాపణల కోసం దుఆ చేయమని ఆదేశించాడు. అంతేగాకా వారితో సలహాలు, సంప్రదింపులు జరుపమని కూడ సూచించాడు.

**మజ్లిసె శూరా సలహాలు ఇచ్చును, తీర్మాణం కాదు:**

కావున ఈ విధానాలను మరియు బోధనలను అనుసరించి మజ్లిసె శూరా నిర్వహించడం జరుగుతుంది. కాని ఈ మజ్లిస్ సలహాలు ఇచ్చునదే కాని తీర్మాణం చేయునది కాదని దీని పేరు ద్వారానే తెలుస్తుంది.

అందుకే సలహాలు తీసుకున్న తరువాత నువ్వు తీసుకున్న నిర్ణయంపై పూర్తిగా అల్లాహ్ తఆలానే నమ్ముకుంటూ ఆచరించుము. అల్లాహ్ తఆలాపై పూర్తి నమ్మకం ఉన్నప్పుడే అల్లాహ్ తఆలా దాని ఫలితాలలో కూడ గణించలేని శుభములను అందించును. నమ్మకపు అత్యున్నతస్థాయికి చెందిన ఉదాహరణ మనకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంలో కనిపిస్తుంది.

అనేక వ్యవహారాలలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అల్లాహ్ తఆలా ద్వారా ప్రత్యక్షంగా మార్గదర్శకం లభించేది. కాని అల్లాహ్ తఆలా ద్వారా స్పష్టమైన ఆదేశాలు వెలువడని ముఖ్యమైన వ్యవహారాలలో హుజూర్ (స) తప్పకుండా సలహాలు సేకరించేవారు. కావున పదవి దారులు జమాఅత్ సభ్యులతో ఎలా వ్యవహరించాలి? మనం పరస్పరం సలహాలు సంప్రదింపులతో పని చేయాలనే విషయాన్ని అల్లాహ్ తఆలా ఈ ఆదేశాలు మరియు హుజూర్ (స) ఈ ఆచరణలు మనకు స్పష్టంగా తెల్పుతున్నాయి.

అహ్మదియ్య జమాఅత్‌కు అల్లాహ్ తఆలా ఖిలాఫత్ అనే

అనుగ్రహాన్ని ప్రసాదించి అల్లాహ్ గొప్ప ఉపకారం చేశాడు. అందుకే వర్తమాన ఖలీఫా కూడ అల్లాహ్ తఆలా ఆదేశాలు, హజ్రత్ ముహ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సున్నత్ (సాంప్రదాయం) మేరకు ప్రపంచంలో వ్యాప్తి చెందినటువంటి జమాఅత్‌ల నుండి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా సలహాలు సేకరిస్తాడు.

**మహా ప్రవక్త స.అ.స అత్యధికంగా సలహాలు సేకరించేవారు:**

ఒకవేళ అల్లాహ్ తఆలా కోరుకున్నచో అన్ని వ్యవహారాలలో అల్లాహ్ తఆలా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మార్గదర్శకం చేసేవాడనే విషయంలో ఎలాంటి అనుమానం లేదు. కాని కొన్ని వ్యవహారాలలో సలహాలు సంప్రదింపులు జరపాలని అల్లాహ్ తఆలా హుజూర్ (స)ను ఆదేశించి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కొన్ని వ్యవహారాలలో సలహాలు తీసుకోవడంను చూసినచో వాస్తవానికి వారు మనలను సన్మార్గంలో నడిపించడానికి మరియు పరస్పరం సహకరించుకుంటూ సలహాలు సంప్రదింపులు జరుపుకోవడానికే, సమాజంలో ఐక్యమత్యంను ఏర్పర్చడానికే అని తెలుస్తుంది. ఈ అంశంను గూర్చి ఒక హదీస్ ద్వారా ఇంకా స్పష్టత లభిస్తుంది. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. شَاوِرْهُمْ فِي الْأَمْرِ అనే సూక్తి అవతరించినప్పుడు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. నిజానికి అల్లాహ్ మరియు అతని ప్రవక్తకు దీని అవసరం లేనప్పటికి అల్లాహ్ తఆలా ఈ ఆదేశంను నా సమాజం కోసం ఒక కరుణా ప్రదాయినిగా చేశాడు. కావున వీరిలో నుండి ఎవరైతే సలహాలు తీసుకుంటారో వారు సన్మార్గం మరియు మార్గదర్శకత్వంను కోల్పోరు. సలహాలు సంప్రదింపులు జరుపని వారు

అవమానంనకు గురి కాకుండా ఉండలేరు.

(అల్ జామిఅ లిషుఅబిల్ ఈమాన్, సంపుటి 10, పుట 41 హదీస్ 7136

ప్రచురణ: మక్తబతు రుష్ద్ నాషిరూన్ రియాజ్ 2003)

మొత్తానికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆయా సలహాలు సంప్రదింపులకు మినహాయింపు గలవారైనను హుజూర్ (స) తమ సమాజం ముందు ఆదర్శంగా నిలుచుటకు మరియు తమ సమాజం ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా కరుణను పొందాలని, ఎల్లప్పుడు సన్మార్గం మరియు మార్గదర్శకత్వపు మార్గాలలో నడవాలని, అవమానాల నుండి కాపాడబడాలని హుజూర్ (స) సలహాలు సేకరించేవారు.

అల్లాహ్ తఆలా ప్రత్యేకమైన ఉపకారం వలన మనలో శూరా వ్యవస్థ కొనసాగుతుంది. కావున ప్రతి అహ్మదీయుడు సాధారణంగా, ప్రతి శూరా సభ్యుడు ప్రత్యేకంగా ఈ వ్యవస్థను గౌరవిస్తూ అల్లాహ్ తఆలాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెల్పుకోవలెను. అతడే మన కోసం సన్మార్గం, మార్గదర్శకత్వపు మార్గాలను తెరిచినాడు.

**మహా ప్రవక్త స.అ.స. సలహాలు సేకరించే విధానాలు:**

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏయే సందర్భాలలో సలహాలు సేకరించారు, హుజూర్ (స) సలహాలు సేకరించు విధానం ఎలా ఉండేది?, అనే అంశాలను గూర్చి చారిత్రాత్మక ఆధారాలతో కొన్నింటిని మీ ముందు ప్రస్తావింతును. ఆ విధానాలనే ఖులఫాయే రాషిదీన్ కొనసాగించారు. ఆ తరువాత నేటి కాలంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కూడా ఇదే విధానమును అనుసరించారు.

సాధారణంగా సలహాలు సేకరించడానికి మూడు విధానాలను అనుసరించినట్లు మనకు కనిపిస్తుంది.

**మొదటి విధానం**

మొదటి విధానం ఏమిటనగా, ఏదేని విషయంలో తప్పకుండా సలహాలు సేకరించాలని భావించినప్పుడు ప్రజలు గుమికూడాలని ఒక వ్యక్తితో చాటింపు వేయించేవారు. ప్రజలు గుమికూడిన తరువాత వారి నుండి అభిప్రాయాలను సేకరించేవారు. వచ్చిన సలహాలకు అనుగుణంగా హజ్రత్ ముహ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం లేదా వర్తమాన ఖలీఫాలు తీర్మాణం చేసేవారు. అనగా వారి సలహాలు సేకరించిన తరువాత మేము ఈ తీర్మాణం చేశాము. కావున ఈ విధంగా ఇది ఆచరించబడును ఆ కాలంలో నాయకత్వ వ్యవస్థ కొనసాగేది. అందుకే ఆ తెగలకు చెందిన ప్రజలు సమావేశమయ్యేవారు. కాని ఆ తెగకు చెందిన నాయకుడు గాని, అనుభవజ్ఞుడు గాని అభిప్రాయాన్ని తెలిపేవాడు. వారందరికి ఒక ప్రతినిధి ఉండేవాడు. ప్రజలు అతని మాటను మనస్ఫూర్తిగా అంగీకరించేవారు. అనగా మా నాయకుడు లేదా మా కుల పెద్ద మా తరుపున అభిప్రాయాన్ని వ్యక్తపర్చగలడు అని సంతోషంతో రాజీపడేవారు. అంతేగాకా ఆ సమయంలో అప్పటి ఆచారానికి భిన్నంగా ఎవరైన అత్యుత్సాహంను ప్రదర్శిస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తపర్చుటకు ప్రయత్నించినచో మీ నాయకుడిని లేదా అధ్యక్షునికి ముందుకు వచ్చి తన అభిప్రాయాన్ని తెల్పవలెనని చెప్పమని హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అట్టి వ్యక్తికి సూచించే వారు. ఈ విధంగా నీ అభిప్రాయానికి ఎలాంటి ప్రాధాన్యత ఉండదని చెప్పేవారు. ఇదొక విధానముండెను.

## రెండవ విధానం

రెండవ విధానం ఏమిటనగా ఏయే వ్యక్తులను హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సలహాలిచ్చుటకు యోగ్యులుగా భావించేవారో, ఆయా వ్యక్తులను పిలిపించుకొనే వారు, సాధారణంగా అందరిని పిలిపించుకొనే వారు కాదు, అలా ఆయా కొంత మందితోనే సలహాలు సేకరించబడేది.

## మూడవ విధానం

మూడవ విధానం ఏమిటనగా, ఏ వ్యవహారంలోనైతే ఇద్దరిని కూడ ఒకచోట పిలిపించుకొని సలహాలు తీసుకోకూడదని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం భావించినప్పుడు హుజూర్ (స) ఒక్కొక్కరిని విడివిడిగా పిలిపించుకొని సలహాలు సేకరించేవారు. ముందుగా ఒకరిని పిలిచి సలహా తీసుకునేవారు, ఆ తరువాత రెండవ వ్యక్తిని పిలిచి సలహా తీసుకునే వారు.

(ఖితాబాతె షూరా, సంపుటి 1, పుట 6-7, మజ్లిసె ముషావరత్ 1922)

మొత్తానికి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మూడు విధానాల ద్వారా సలహాలు సేకరించేవారు. ఖులఫాయే రాషిదీన్ కూడ ఆయా విధానాలకు అనుగుణంగానే సలహాలు తీసుకునేవారు. ముందుగా తెల్పినట్లుగా అల్లాహ్ మరియు అతని ప్రవక్త ఇలా సలహాలు తీసుకోవడానికి మినహాయింపు గలవారని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు. అయినా కూడ మనం చరిత్రను చూసినచో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనేక సందర్భాలలో సలహాలు తీసుకున్నారని తెలుస్తుంది. ఇంకా చెప్పదలచినచో హుజూర్ (స) అనుచరులు (రజి) నుండి ఎక్కువగా సలహాలు తీసుకునేవారు. ఈ

క్రమంలో హ(జ్రత్ అబూ హురైరహ్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మించి మరొకరు అనుచరుల నుండి సలహాలు సేకరించినవారు లేరు.

(సునన్ అత్తిర్మిజి, అబ్వాబుల్ జిహాద్ బాబ్ మా జాఅ ఫిల్ మష్వరతి, హదీస్:1714)

**హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)ను యెమెన్‌కు పంపుట:**

ఇవన్నియు ఎందుకు అనగా నేను ముందుగా తెల్పినట్లుగా ఒక వేళ అల్లాహ్ తఆలా ప్రవక్తయే అల్లాహ్ తఆలా నుండి ప్రత్యక్షంగా మార్గదర్శకత్వం పొందుతున్నప్పటికి సలహాలు తీసుకుంటున్నప్పుడు మీరు కూడ ఈ సలహాల ప్రాధాన్యతను అర్థం చేసుకొటకు ఎంతగా ప్రయత్నించవలెనో తెల్పడమే దీని ఆంతర్యము. హుజూర్ (స) సలహాలు సేకరించిన సందర్భాలలో ఒక సందర్భాన్ని మీ ముందు ప్రస్తావింతును. ఒక కథనములో ఈ విధముగా గలదు. హ(జ్రత్ ముఆజ్ బిన్ జబల్ రజియల్లాహ్ తఆలా అన్‌హు ఇలా తెలిపారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నన్ను యెమెన్‌కు పంపించాలని నిర్ణయించుకున్నప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం అనేక మంది అనుచరుల నుండి సలహాలు తీసుకున్నారు. ఆయా అనుచరులలో హ(జ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తఆలా అన్‌హు, ఉమర్ రజియల్లాహు తఆలా అన్‌హు, ఉస్మాన్ రజియల్లాహు తఆలా అన్‌హు, తల్హా రజియల్లాహు తఆలా అన్‌హు, జుబైర్ రజియల్లాహు తఆలా అన్‌హుతో పాటు ఇంకా చాలా మంది అనుచరులుండిరి. హ(జ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇలా విన్నవించుకున్నారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ మా నుండి సలహాలు సేకరించనిచో మేము ఏమియును మాట్లాడక పోయేవారము. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి

వసల్లం ఇలా తెలిపారు. ఏయే ఏయే అంశాలలో నాకు దైవవాణి ద్వారా ఏదేని విషయం తెలియ జేయడం జరుగదో ఆయా విషయంలో నేను మీ లాంటి వాడినే.

ఏయే అంశాలలో నాకు దైవవాణి అందదో ఆయా విషయాలలో నేను మీ వలే వ్యహరిస్తాను. ముఆజ్ రజియల్లాహు తఆలా అన్హు ఇలా తెలిపారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆకాంక్ష (అనగా నాకు సలహా ఇవ్వండి) మేరకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సలహాలు సేకరిస్తున్నారు. ఆ క్రమంలో ప్రతి ఒక్కరు తమ తమ అభిప్రాయాలను తెల్పుతున్నారు. ఆ తరువాత హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ముఆజ్ నీవు కూడ నీ సలహా ఏమిటో చెప్పుము. అందుకు నేను హజ్రత్ అబూబకర్ రజియల్లాహు తఆలా అన్హు అభిప్రాయమే నా అభిప్రాయమని సమాధానమిచ్చాను.

(అల్ ముఅజముల్ కబీర్ లిత్తబ్రానీ, సంపుటి 20, పుట 67, హదీస్ 124, ప్రచురణ దార్ అహ్యా ఉత్తారసుల్ అరబి బేరూత్)

కావున వారిని (ముఆజ్‌ను) కూడ వారు (స) సలహా అడిగారు. మొత్తానికి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అభిప్రాయం వారి ఔన్నత్యం, వారి నిరాండబరతను, వారు సలహాలకు ఇస్తున్న ప్రాధాన్యతను మనకు తెల్పుతున్నది. అంతేగాక మనం ఎంతగా సలహాలకు ప్రాధాన్యతనివ్వవలెనో అనే విషయాన్ని తెల్పుటలో మన కోసం హుజూర్ (స) ఒక ఆదర్శం. అనుచరుల విధానం మనకు నేర్పు గుణపాఠం ఏమిటనగా వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశం మేరకు సలహాలు ఇచ్చేవారు. ఆ సమయంలో వారు తమ సామర్థ్యములు మరియు అనుభవంకు అనుగుణంగా నిష్టాపరతను

అవలంభిస్తూ సలహాలిచ్చేవారు.

ఆ తరువాత మదీనాకు ప్రస్థానం జరిగిన అనంతం అవిశ్వాసులు ముసల్మానుల శాంతి, సామరస్యతలకు భంగం కల్గించుటకు ప్రయత్నించి నప్పుడు వాటిని అడ్డుకోవడానికి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల నుండి సలహాలు సేకరించారు. అన్సార్ నాయకుల ను కూడ ఇందులో భాగస్వాములను చేశారు. ముహాజిర్ నాయకులను కూడ ఇందులో భాగస్వాములను చేశారు. ముహాజిర్ మరియు అన్సార్ నాయకుల సలహాలు మరియు అభీష్టం మేరకే హుజూర్ (స) బద్ర్ వైపు బయలు దేరారు. అన్సార్ నాయకులు ఆ సలహా కార్యక్రమములో ప్రదర్శించిన స్వచ్ఛత మరియు విధేయతను, చేసిన వాగ్దానమును చూసి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చాలా సంతోషించారు, చాలా సంతృప్తిని వ్యక్తపరిచారు.

(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స) సాహెబ్జాదాహ్ హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ పుట 354-355)

ఎందుకనగా సలహాల వరకే పరిమితం కాకుండా సలహాలిచ్చే వారి ఆచరణ, వ్యవహారము, ఆయా సలహాపై మొట్టమొదటగా స్వయంగా ఆచరించే ప్రతిజ్ఞ గలదు.

ఒకవేళ ఆచరిస్తామనే వాగ్దానమే లేకుంటే, నిజానికి అందుకు అనుగుణంగా నడుచుకోక పోయినచో అలాంటి సలహా వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆ తరువాత అనుచరులు బద్ర్ యుద్ధంలో ఎలాంటి స్వచ్ఛతను, విధేయతను, వినమ్రతను తమ ఆచరణాల ద్వారా ప్రదర్శించారో మనం వాటిని చూశాము. వారు సలహాలు ఇచ్చినప్పుడు తమ ప్రాణాలను అర్పించుటకు ముందుకు వచ్చారు. కావున మన

షూరా సభ్యులు ఎక్కడెక్కడ ఉన్నారో వారందరు కూడ సలహాలు ఇచ్చిన తరువాత అందరి కంటే ముందుగా అందుకు అనుగుణంగా నడుచుకోవడానికి సిద్ధంగా ఉండాలని, మనం ఆయా సలహాలు తీర్మాణాలుగా అమోదించబడిన తరువాత వాటిని ఆచరించాలని, లేదా వర్తమాన ఖలీఫా తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా అందరి కంటే ముందుగా మనమే నడుచుకోవాలని, అందుకు అన్ని రకాల త్యాగాలు చేయాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఎప్పుడు మీరు తమ ఆచరణాత్మక ఉదాహరణను నిలబెట్టుతారో అప్పుడే జమాఅత్ సభ్యులు కూడ సంతోషంగా వాటిని ఆచరించుటకు, అన్ని రకాల త్యాగాలకు తమను తాము అర్పించుకుందురు. ప్రతి అహ్మదీయుడు ఖిలాఫత్‌తో వినయంగా ఉంటానని, విధేయతను చూపిస్తానని వాగ్దానం చేశాడనే విషయాన్ని శూరా సభ్యులు ఎల్లప్పుడు గుర్తుంచు కోవాలి. ఇందుకోసం అత్యున్నతమైన ఆచరణను పదవిదారులు మరియు శూరా సభ్యులు చూపాలి. ఎందుకనగా మీరే ఈ వ్యవస్థకు చెందిన సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఈ వ్యవస్థయే ఖిలాఫత్ మరియు జమాఅత్ వ్యవస్థలకు సహాయ వ్యవస్థగా నిలుస్తుంది.

**ప్రతినిధులు సదుద్దేశంతో సలహాలివ్వవలెను:**

మరల ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయంను అనుసరిస్తూ ధార్మిక ముఖ్యమైన కార్యకలాపాలలో సమాజీకుల నుండి సలహాలు తీసుకొమ్మని, మృదుస్వభావంతో వ్యవహరించమని, దుఆలు చేయమని కూడ వర్తమాన ఖలీఫా ఆదేశించబడిన విధంగానే సలహాలిస్తున్న వారు ఎల్లప్పుడు సదుద్ధేశము, నిష్టాపరతను పాటిస్తు సలహాలివ్వవలెనని ఆదేశించబడిరి.

కావున సదుద్ధేశముతో నిష్టాపరత యొక్క అత్యున్నతమైన ప్రామాణికంను దృష్టియందుంచుకొని సలహాలివ్వవలెనని ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవలెను.

కావున సలహాలు ఇచ్చేవారికి కూడ ఇక్కడ చాలా పెద్ద బాధ్యతను అప్పగించడం జరిగింది. అనగా వారి నిష్టాపరత ఏ స్థాయికి చెందినదో వారు తమను తాముగా పరిశీలించుకోవాలి. హజ్రత్ అలీ రజియల్లాహ్ తఆలా అన్హు ఒక కథనము చాలా స్పష్టంగా మనకిట్లు వివరించెను. వారు (రజి) ఇట్లు తెలిపిరి. شَاوِرُوْا الْفُقَهَاءَ وَالْعَابِدِيْنَ (కన్‌జుల్ ఉమ్మాల్, సంపుటి 3, పుట 411, హదీస్ 7191, ప్రచురణ ముఅస్ససతు రిసాలహ్, బేరూత్ 1985). అనగా అందరితో కాకుండా వివేకవంతులు మరియు దైవారాధకుల నుండి మాత్రమే సలహాలు సేకరించండి. ఇది ప్రతినిధుల ప్రామాణికం.

శూరాకు ప్రతినిధులుగా ఎన్నుకోబడేవారికి కూడ ఇందులో ఇట్లు ఉపదేశం గలదు. మీలో నుండి వివేకవంతులను, ధార్మిక విజ్ఞానం పట్ల ఉత్తమ అవగాహన కల్గినవారిని మరియు దైవారాధనలలో కూడ ఉన్నత ప్రామాణికం గలవారిని ఎన్నుకోండి.

ఈ ప్రామాణికాన్ని దృష్టియందుంచుకొని ఏయే ప్రాంతాలలో ప్రతినిధులను ఎన్నుకుంటారో ఆయా ప్రతినిధుల అభిప్రాయంలో కూడ ఒక ప్రత్యేకమైన వ్యత్యాసం కనిపిస్తుండడాన్ని నేను గమనించాను. జమాఅత్ సభ్యులు సధాభిప్రాయంతో శూరా కోసం ప్రతినిధులను ఎన్నుకున్నప్పుడు వారు కూడ అట్టి సధాభిప్రాయాన్ని పూర్తి చేసి చూపడం కూడ ఆయా ప్రతినిధుల బాధ్యతయే. ఒకరోజు లేదా కొన్ని వారాలలోనే ఎవరైనా సరే విజ్ఞానపరమైన ఉన్నత ప్రామాణికానికి మరియు ధార్మిక

ఆంతర్యములను తెలుసుకొను స్థాయికి చేరుకోలేరు. కాని నిష్టాపరతను అవలంభిస్తూ అన్ని రకాల స్వప్రయోజనాలను ప్రక్కన పెట్టి ఉత్తమమైన అభిప్రాయాన్ని మాత్రం ప్రతి ఒక్కరు వ్యక్తపర్చవచ్చును. అదే విధంగా అల్లాహ్ తఆలా ముందు మోకరిల్లుతూ, అతని నుండే సహాయాన్ని అర్జిస్తూ, దుఆలు చేస్తూ ఏయే ప్రాంతాలలో మజ్లిసె శూరా సమేవాశాలు నిర్వహించ బడుతున్నాయో ఆయా ప్రాంత ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తపర్చ వచ్చును. అంతేగాని ఒక ఉపన్యాసకుడి ఉపన్యాసంకు ప్రభావితమై గాని లేదా ఇతరులతో ఉన్నటు వంటి అనుబంధం, స్నేహం వలన గాని ఇతరుల అభిప్రాయమే తమ అభిప్రాయమని చెప్పకూడదు. ఇతరులకు భయపడిగాని, ఇతరులకు అధిక ప్రాధాన్యతనిస్తూ తమ అభిప్రాయాన్ని మార్చుకోకూడదు. కేవలం నిష్టాపరతను దృష్టియందుంచుకొని జమాఅత్ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అభిప్రాయాన్ని వ్యక్తపర్చినప్పుడే వారు తమ ప్రాతినిధ్యపు హక్కును నిజంగా చెల్లించిన వారగుదురు.

ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, అల్లాహ్ తఆలా మన మనస్సు స్థితిని బాగుగా ఎరుగును. మనం చేసే ప్రతి పనిని చూస్తుంటాడు. ఒకవేళ నేను అతని ప్రీతిని దృష్టియందుంచుకొని పని చేయనిచో అల్లాహ్ తఆలా కోపానికి ఎక్కడ గురవుతానో అనే భయముండాలి. అదే విధంగా ఎక్కడైతే షూరా కార్యక్రమాలు ముగిసాయో ఆయా ప్రాంతాల సభ్యులు తమ నడవడిక మరియు తమ ఆధ్యాత్మిక స్థితిగతులపై దృష్టి సారిస్తూ నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేయండి. తీర్మాణం చేయబడేవి లేదా తీర్మాణించబడిన వాటిపై నిష్టాపరతతో నడుచుకుంటూ ఆచరించుటకు ప్రయత్నించవలెను.

మనం ఈ స్థితులను ఏర్పర్చుకున్నప్పుడే మనం అల్లాహ్ తఆలా కరుణను ఆకర్షించు వారమవుతాము. అప్పుడే మన తీర్మాణంలో కూడ శుభములు కలుగుతాయి. లేనిచో మనం ఏకమవడం, తమ అభిప్రాయం వ్యక్తపర్చడం కోసం ఉత్సాహా భరితమైన ప్రసంగాలు చేయడం వంటివి నిష్టాపరత లేని ప్రాపంచిక అసెంబ్లీల వేదికలను పోలినట్లు ఉండును. అప్పుడు చేయబడే తీర్మాణలు కొన్ని సార్లు సుగుణాలనే నాశనం చేయునవిగా మారిపోతాయి. పైగా అల్లాహ్ తఆలా ఆదేశాలకు వ్యతిరేకమై ఉంటాయి. తమ జాతి ప్రయోజనాలనే దృష్టియందుంచుకోవడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో అలాంటి తీర్మాణాల ఫలితాలు కూడ చాలా త్వరగా వెలువడుతుంటాయి. అవి శాంతి భద్రతలను నాశనం చేస్తాయి. మరి కొన్ని సార్లు ఆలస్యంగా కూడ ఫలితాలు వెలువడుతాయి. కాని వాటిలో శుభములుండవు. మొత్తానికి అల్లాహ్ తఆలా సృష్టి ధర్మానికి మరియు ఆదేశాలకు వ్యతిరేకంగా ఉండే తీర్మాణాల వలన చివరికి జాతులకు జాతులే నాశనమైపోతాయి.

కావున ప్రాపంచీకుల స్థితులను చూసిన తరువాతనైన మనం మన పరిస్థితులను మెరుగు పర్చుకొనుటకు శ్రద్ధ చూపాలి.

నేను ముందుగా తెల్పినట్లుగా శూరా సభ్యుల అభిప్రాయాలు వర్తమాన ఖలీఫా సన్నిధికి పంపించబడుతాయి. వర్తమాన ఖలీఫా ఆదేశముతోనే ఈ శూరా నిర్వహించబడుతుంది.

**ఖిలాఫత్ తర్వాత మజ్లిసె శూరా అత్యంత ప్రధానం:**

కావున మనం గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, మజ్లిసె శూరా ఖిలాఫత్‌కు సహాయంగా నిలుచునట్టి వ్యవస్థ. ఈ కారణంగా జమాఅత్‌లో ఖిలాఫత్ వ్యవస్థ తరువాత దీనికే అత్యధిక ప్రాధాన్యత

గలదు. శూరా కోసం ఎన్నుకోబడే ప్రతి సభ్యుడు ఒక సంవత్సరం కోసం సభ్యుడిగా కొనసాగుతాడు. కావున అతను తన ఈ ప్రాధాన్యతను ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. శూరా యొక్క ఎజెండా మరియు సలహాల ద్వారానే వర్తమాన ఖలీఫాకు వివిధ దేశాలలో ఉన్నటు వంటి సమస్యల గూర్చి తెలుస్తుంది. కావున వచ్చిన అభిప్రాయాల నుండి ఆయా సమస్యలకు పరిష్కారంగా ఒక ప్రణాళికను రూపొందించడం జరుగుతుంది. కొన్ని సమయాలలో కొన్ని అంశాలకు చెందిన సమస్యలకు పూర్తి పరిష్కారంను గూర్చి వివరించలేక పోతుంటారు. లేదా శూరా సభ్యుల దృష్టికి అవి రాలేక పోతాయి. కాని ఖలీఫాలు మాత్రం ఆయా అంశాలను కూడ ప్రణాళికలో చేర్చుతాడు. కొన్ని చోట్ల నేను కూడ ఇలాంటి విధానాన్నే అనుసరిస్తుంటాను. మొత్తానికి శూరాకు ఒక ప్రత్యేక ప్రాముఖ్యత గలదని ప్రతి శూరా సభ్యునికి పూర్తి అవగాహన ఉండాలి. ఈ ప్రత్యేకత కేవలం మూడు రోజుల వరకే పరిమితం కాదు. సంవత్సరం మొత్తం ప్రత్యేకత ఉంటుంది. ప్రణాళికను ఏర్పాటు చేసిన తరువాత దానిని ఆచరింపజేయుటలో, వ్యవస్థ అధికారులకు కూడ ఆయా ప్రణాళికకు అనుగుణంగా పూర్తి స్థాయిలో నడుచుకునేటట్లుగా అన్ని విధాలుగా సహకరించుటకు ప్రతి శూరా సభ్యుడు ప్రయత్నించాలి. ఇది అతని బాధ్యత కూడ. ఇలా జరిగినప్పుడే జమాఅత్ అభివృద్ధికి చెందిన ప్రణాళికలు సరైన విధంగా ముందుకు వెళ్లుతాయి, వాటిపై పూర్తి స్థాయిలో ఆచరించ గల్గుతారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంనకు అప్పగించబడిన మార్గదర్శకత్వం, సన్మార్గపు లక్ష్యంను పూర్తి చేయడంలో మనం కూడ సహాయకులుగా నిలిచిన వారమవుతాము. ఇలా సహకరించనిచో శూరా

సభ్యుడు కావడం నిష్ప్రయోజనమే అవుతుంది.

**ప్రతినిధులు ప్రశాంతతను పాటించవలెను:**

ఇక్కడ మరొక విషయాన్ని ప్రస్తావించదలిచాను. ప్రపంచంలోని అన్ని దేశాలలో శూరా కార్యకలాపాలు ఆయా దేశాల అమీర్ సారథ్యం లో నిర్వహించబడుతాయి. కొన్ని సార్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చు వారు ఉత్సాహంతో, ఉత్తేజంతో ఉపన్యసిస్తూ శూరా పవిత్రతకు భంగం కల్గించే పదాలను పలుకు తుంటారు. మొదటి విషయమేమనగా సభ్యులు ఎప్పుడు ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తపర్చిన కూడ అత్యుత్సాహంను ప్రదర్శిస్తూ మరియు తెలివి తేటలను పోగోట్టుకొంటూ ఉపన్యసించే బదులు, రెచ్చగొట్టే విధముగా ప్రసంగాలు చేసే బదులు, సరళమైన, సభ్యతగల పదాలతో ప్రశాంతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్త పర్చండి.

కొన్ని సార్లు అభిప్రాయాన్ని వ్యక్త పర్చువారు ఉపయోగించే పదాల వలన సభ్యులు గాని, శూరాను కొనసాగిస్తున్న అమీర్ లేదా సదర్ గాని ఈ సభ్యుడు పరోక్షంగా లేదా ప్రత్యక్షంగా మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని భావించుకుంటారు. అందువలన ఆ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నప్పుడు అలాంటి సభ్యుడిని కఠిన పదాలలో మందలిస్తూ, అడ్డుకోవడం జరుగుతుంది. అసహనాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. కావున అమీర్‌లు కూడ సహనాన్ని పాటించాలి. అంతే గాకా ఆ సభ్యుడు జమాఅత్ ప్రయోజనాలను దృష్టియందుంచుకొని, జమాఅత్ పట్ల ఉన్నటు వంటి బాధతో అలా మాట్లాడుతున్నాడని సానుకూలంగా అర్థం చేసుకోవాలి.

ఒకవేళ కఠిన పదాలను ఉపయోగించినచో లేదా శూరా పవిత్రతకు భంగం వాటిల్లునటువంటి పదాలను ఉపయోగించినచో

అతణ్ణి సున్నితంగా అడ్డుకోవలెను కాని సమావేశ అధ్యక్షుడు వ్యక్తిగత గౌరవంగా భావించినట్లు అర్థమయ్యే రీతిలో వ్యవహరించకూడదు.

ప్రత్యేకించి బడ్జెట్ విషయంలో చర్చలు జరుగినప్పుడు అధిక భావాలు వెలువడుతాయి. కొన్ని ఆందోళనలు కూడ వ్యక్తమవు తుంటాయి. ఇలాంటి పరిస్థితులలో కూడ సంబంధిత కార్యదర్శి లేదా ఆర్థిక కార్యదర్శి లేదా సభాధ్యక్షుడు సహనంగా వారి విషయంను విని దానికి సమాధానం ఇవ్వవలెను. బడ్జెట్ ఏ విధంగా తయారు చేయడం జరిగింది, ఎలా సేకరించడం జరుగుతుంది? ఎలా ఖర్చు పెట్టడం జరుగుతుంది, ఎలా justify చేయబడుతుందనే విషయాలను అర్థమయ్యే విధంగా తెలిపి సంతృప్తి పరచవలెను. అభిప్రాయాన్ని వ్యక్త పర్చు సభ్యులు జమాఅత్ ప్రయోజనాల దృష్ట్యా మాట్లాడుతుంటారు. కావున చెడుగా భావించకూడదు. అదే విధంగా అజెండాలోని ఇతర అభిప్రాయాలుంటాయి. కొన్ని సార్లు అప్పుడు జరుగుతున్న అనవసర చర్చలో నిర్వాహకులు మరియు ప్రతినిధులు కూడ ఆందోళనకు గురవు తుంటారు. లేదా నిర్వాహకుల పట్ల చాలా ఎక్కువ భయమున్నట్లుగా పూర్తిగా మౌనం వహిస్తుంటారు. ఇలా భయపడేవారు కూడ తమ హక్కును చెల్లించలేరు. కావున ప్రాతినిధ్యం వహించుటకు మరియు న్యాసపు హక్కులను చెల్లించుటకే ప్రజలు ప్రతినిధులను ఎన్నుకున్నారని ఎల్లప్పుడు గుర్తుంచుకోవలెను.

అందుకే ఎవరు కూడ వ్యక్తిగతంగా తీసుకోవద్దు, ఎవరు కూడ ఎలాంటి భయానికి లోనుకాకూడదు.

تُؤَدُّوا الْاَمٰنٰتِ اِلٰٓى اَهْلِهَا (అన్నిసా: 4/59)

అనగా న్యాసాలను వారి అర్హులకు అప్పగించండి అనే అల్లాహ్ తఆలా

యొక్క ఆదేశానుసారంగా ప్రజలు వారిని సభ్యులుగా ఎన్నుకున్నారని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి. ప్రజలు సదుద్దేశంతో అల్లాహ్ తఆలా ఆదేశాలను పాటిస్తూ తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని అందుకు అనుగుణంగానే వారు తమ తమ హక్కులను చెల్లిస్తున్నారని వర్తమాన ఖలీఫా కూడ అదే విధంగా అర్థం చేసుకుంటాడు. ఒకవేళ ఆయా ప్రతినిధులు ఆ హక్కును శూరా మరియు శూరా తరువాత చెల్లించనిచో వారు జమాఅత్ సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయువారే కాకుండా వర్తమాన ఖలీఫా దృష్టిలో కూడ తమ న్యాసాన్ని చెల్లించని వారవుతారు. పైగా అన్యాయులుగా మిగిలిపోతారు. కాని ఇక్కడ మరొక విషయం గుర్తుంచు కోగలరు. కొందరు నిష్టాపరతను దృష్టియందుంచు కోకుండానే ప్రతినిధులను ఎన్నుకుంటారు. అలాంటి వారు బంధు ప్రీతి లేదా స్నేహానికి ప్రాధాన్యతనిస్తు సభ్యులను ఎన్నుకుంటారు.

మొత్తానికి ఇలా ఎన్నుకున్నచో అలా ఎన్నుకునేవారు కూడ పాపము చేసిన వారవుతారు. ఎందుకనగా వారు తప్పు చేశారు. ఒకవేళ వారు అట్టి హక్కును చెల్లించనిచో వారు వెంటనే ఇస్తిఘ్ఫార్ చేయవలెను. కాని ఆచరణ పరంగా మరియు ఆధ్యాత్మిక పరంగా ఉండాల్సిన ప్రామాణికం లేకుండానే ఎన్నుకోబడిన వారిని వారు పదవిదారులైన ను లేదా ప్రతినిధులైనను వారు ఎన్నుకోబడినందున వారిని అట్టి శూరాకు సభ్యులుగా అనుమతిస్తుంటాను. కావున వారు కూడ ఇస్తిఘ్ఫార్‌లను పఠించాలి. తమ స్థితిగతులలో అనుకూల మార్పును కల్గించుకుంటూ, నిష్టాపరతతో ముందుకు నడుచుటకు ప్రయత్నించాలి. తమను తాము న్యాసపు హక్కును చెల్లించు వారిగా మల్చుకొనుటకు ప్రయత్నించాలి. ఇలాంటి ప్రయత్నాలు జరిగినప్పుడే అల్లాహ్ తఆలా

ప్రీతిని పొందువారగుదురు. అంతేగాకా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లక్ష్యాన్ని నెరవర్చుటలో సహాయకులుగా నిలిచెదరు. తమ ఆచరణ మరియు ఆధ్యాత్మిక స్థితిగతులను ఉన్నతంగా తీర్చిదిద్దు కొనువారగుదురు.

**ప్రతినిధుల కాల పరిమితి ఒక సంవత్సరం:**

నేను ఇంతకు ముందు తెల్పిన విధంగా ప్రతినిధులు ఒక సంవత్సరం కోసం ఎన్నుకోబడుతారు. కావున ఈ మధ్య కాలంలో వారు నిర్వాహకులకు సహకారం అందించాలి. అంతేగాకా తీర్మాణాలను స్వయగాం ఆచరించాలి. ఇతరుల ద్వారా ఆచరింపజేయాలి. ఈ అంశం ను గూర్చి మీ జమాఅత్‌లో ఆచరిస్తున్నారా? లేదా? ఏ స్థాయిలో ఆచరిస్తున్నారు? వర్తమాన ఖలీఫా తీర్మాణించినట్లుగా ఆచరిస్తున్నారా? లేదా? అని ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలి.

ఈ విధంగా మీరు వర్తమాన ఖలీఫాకు సహాయకులుగా నిలవాలి. తీర్మాణాలు జమాఅత్‌లకు వెళ్ళిన తరువాత పదవి దారుల అలసత్వానికి గురవుతుండడాన్ని కొన్ని సందర్భాలలో చూస్తుంటాము. తీర్మాణించబడిన వాటికి అనుగుణంగా నడుచుకోవడం జరుగదు. అలాంటి పరిస్థితులలో ప్రతినిధుల కర్తవ్యమేమనగా వారు కేవలం జమాఅత్ సభ్యులకే కాకుండా పదవిదారులకు కూడ ఇటువైపు శ్రద్ధను కనబర్చేలా సూచించవలెను. అయినా కూడ వారు శ్రద్ధ చూపనిచో, ఆయా నిర్ణయాల మేరకు అనగా నడుచుకోవలసిన విధంగా నడుచు కోవడం లేనిచో వారు కేంద్రానికి వ్రాసి పంపవచ్చును. అలాగే చాలా మంది పదవిదారులు కూడ శూరా సభ్యులుగా ఎన్నుకోబడుతారు. కావున వారు కేవలం వారి శాఖకు చెందిన పనులను చూసుకోవడమే

గాకుండా శూరా నిర్ణయాలను, మరియు వర్తమాన ఖలీఫా తీర్మాణాలకు అనుగుణంగా నడుచుకోనిచో, ఆచరించనిచో అలాంటి వారి పట్ల దృష్టి సారించాలి. అలా వారి శాఖకు చెందినవారైనను, ఇతర శాఖలకు చెందిన వారైనను, పదవి దారులైనను, అమీర్‌లు అయినను అందరు ఆచరించేలా చూడాలి. కార్యవర్గ సమావేశాలలో కూడ ఈ విషయాన్ని గూర్చి చర్చించాలి. లేనిచో పదవిదారులు మరియు ప్రతినిధులు ఎవరు కూడ తమ హక్కులను చెల్లించడం లేదని భావించవలసి ఉంటుంది. ఈ ప్రపంచంలో కొందరు సాకులు చెప్పి తప్పించుకుంటారు. కాని అల్లాహ్ తఆలాకు తెలియని ఏ విషయం ఉండదు. న్యాసాలను చెల్లించు విషయంను గూర్చి అతడు తప్పకుండా ప్రశ్నిస్తాడు. అందువలన ఇది చాలా చింతించవలసిన అంశం. మేము శూరాకు ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డామని సంతోషించ కూడదు, గర్వించకూడదు. తమ తమ బాధ్యతల పట్ల ప్రతి ఒక్కరికి చింతన ఉండాలి.

నేను ముందుగా తెల్పినట్లుగా జమాఅత్‌లలో పదవిదారులకు నచ్చజెప్పినా కూడ వారు శూరా నిర్ణయాలను ఆచరించనిచో వారికి నచ్చజెప్పవలసిన బాధ్యత ప్రతినిధులపై ఉంటుంది. వారికి నచ్చజెప్పినా కూడ ఆచరించనిచో వారిని గూర్చి కేంద్రానికి ఫిర్యాదు చేయండి. శూరా అంశాలను అధికులు నేడు కూడ ఆచరిస్తున్నారు. ఆచరించడం లేదని కాదు. కొందరు అందుకు అనుగుణంగా ఆచరిస్తుంటారు. ఒకవేళ పదవిదారులు ఆచరించనిచో వారిని గూర్చి కేంద్రానికి సమాచారాన్ని అందిస్తారు. సాధారణంగా ఎవరేని పదవిదారునితో ఏదేని వ్యక్తిగత బేధాభిప్రాయం ఏర్పడినప్పుడు మాత్రమే ఇలాంటివి జరుగుతుంటాయి. ఇది నిష్టాపరతతో కూడిన పని కాదు. ఒకవేళ నిష్టాపరతను పాటిస్తూ

ప్రతి సభ్యుడు, ప్రతి పదవిదారుడు ఆమోదించబడిన శూరా నిర్ణయాల మేరకు ప్రతి ఒక్కరిని ఆచరింప జేయుటకు ప్రయత్నించినచో ఎన్నడు కూడ ఇలాంటి పరిస్థితి ఎదురు కాదు. అనగా ఆ నిర్ణయం మరల తదుపరి సంవత్సరం లేదా రెండు మూడు సంవత్సరాల తరువాత ప్రవేశపెట్టవలసిన అవసరమే ఉండదు.

**ఒకే అభిప్రాయం పదే పదే రావడానికి గల కారణం!**

మరల పాత అభిప్రాయమే వచ్చినచో దాని అర్థం ఇంతకు ముందు తీసుకున్న నిర్ణయాన్ని పూర్తి స్థాయిలో ఆచరించలేదు. లేదా ఆచరించవలసిన విధంగా ఆచరించి ఉండరు.

కావున ఇలాంటి జమాఅత్ మరియు పదవిదారులు ఆలోచించ వలసినదేమనగా ఇదే నిష్టాపరతను అవలంభించడమా? మరియు దీనినే న్యాసాల హక్కులను చెల్లించడం అంటారా? ఖిలాఫత్ పట్ల విధేయత చూపుతామని చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడం అంటే ఇదేనా? ఆయా దేశాలలో ఉన్నటు వంటి జమాఅత్‌లు మరియు కేంద్రం ఆయా అంశాలపై ఆచరించడం లేదని తెలుసుకున్న తరువాతనే ఇలాంటి అభిప్రాయాలను, ప్రణాళికలను రూపొందిస్తుంది. ఒకవేళ ఆచరిస్తున్నచో, అన్ని స్థాయిల వారు ఆచరిస్తున్నచో అన్ని జమాఅత్‌ల వారు ఏ స్థాయి మేరకు ఆచరిస్తున్నారని పర్యవేక్షిస్తున్నచో ఆయా అభిప్రాయాలు మరల ప్రస్తావించబడవు. కేంద్రం కూడ ఆయా అభిప్రాయాలను మరల సిఫారిస్సు చేస్తూ వర్తమాన ఖలీఫా సన్నిధికి పంపించదు. ఎందుకనగా వాటిని ఒక సంవత్సరం ముందుగాని, రెండు మూడు సంవత్సారల ముందుగాని ప్రవేశపెట్టి ఉంటారు. అందుకే వాటిని శూరాలో మరల ప్రవేశ పెట్టుటకు అనుమతి ఉండదు. ఈ సమాధానం వ్రాస్తున్నప్పుడు

దేశ కేంద్ర వ్యవస్థ సిగ్గుపడుతూ మేము ఈ విషయంలో సిగ్గుపడు తున్నాము, మేము ఈ అంశంపై ఆచరింపజేయలేక పోయాము. ఈ సంవత్సరం ఆచరింప జేస్తాము, ఒకవేళ ఆచరింపజేయనిచో మేము దోషులమవుతాము, తమ న్యాసపు హక్కులను చెల్లించని వారిలో మేము కూడ పరిగణించబడుతామని వ్రాయాలి. ఇలా వారు వ్రాసి పంపాలి. ఆ తరువాత మరల ఇలా వ్రాయండి. కావున మేము మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాము. ఈ అంశాన్ని ఈ సంవత్సరం ప్రవేశ పెట్టుటకు అనుమతి ఇవ్వకండని విన్నవించుకుంటున్నాము. ఇలా వ్రాసినప్పుడే వారికి కూడ బాధ్యతలను గూర్చి తెలిసి వస్తుంది. చివరికి నిర్వాహకులకైన, ప్రతినిధులకైన మేము పెద్ద పెద్ద ప్రణాళికలను రచించి, ఖలీఫా సన్నిధికి పంపించి, మేము ఇలా చేస్తాము, అలా చేస్తాము అని ప్రగల్భాలు పలికాము, కాని అలా చేయలేక పోయాము, కావున దోషులమైనాము, మరియు వర్తమాన ఖలీఫా గారి నమ్మకాన్ని వమ్ము చేశాము అనే భావనైన వారిలో కల్గుతుంది. ఈ విధంగా సామూహికంగా వారిలో ఆత్మ పరిశీలన జరిగినప్పుడు వ్యక్తిగతంగా కూడ పదవిదారులు మరియు శూరా ప్రతినిధులు కూడ తమ ఆత్మ పరిశీలన చేసుకొని ఇస్తిఘ్ఫార్ చదువుతుండాలి. ఈ అంశంపై ఆచరించక పోవడానికి గల కారణాలను కూడ క్రింది స్థాయి నుండి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుండాలి. ఇలాంటి పర్యవేక్షణలే జమాఅత్‌ను సరైన విధంగా ముందుకు తీసుకెళ్తాయి. లేనిచో మాటలు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చలేవు. వివిధ దేశాలలో ఈ స్థాయి మేరకు పర్యవేక్షణలు జరప వలసిన అవసరమున్నది. చురుకుగా పని చేసే కొన్ని active జమాఅత్‌లు పూర్తిగా వంద శాతం కాకపోయినా 70 నుండి 80 శాతం వరకైన

ఆచరిస్తుంటాయి. పూర్తి శ్రద్ధతో ఆచరిస్తుంటాయి. వర్తమాన ఖలీఫా ఆమోదంతో మనకు ఈ ప్రణాళిక అందినది. కావున మనం ఖలీఫా గారి నమ్మకాన్ని వమ్ము కాకుండా చూసుకోవాలి అని ఆలోచిస్తుంటారు. మరి ఈ జమాఅత్ వారికి ఇంతటి ఉత్సాహం ఎక్కడి నుండి వచ్చింది?. ఈ జమాఅత్ సభ్యులలో ఇంతటి విప్లవాత్మక మార్పును తీసుకొచ్చిన ఈ ఉత్సాహం ఎక్కడి నుండి వచ్చిందనే విషయాన్ని తెలుసుకోవాలి. ఇలాంటి చురుకుదనం గల జమాఅత్ పదవిదారుల మరియు అశ్రద్ధ చూపు జమాఅత్ పదవిదారులతో సమావేశం నిర్వహించాలి. ఇంకా చెప్పదలచినచో కేంద్ర పదవిదారులతో కూడ సమావేశం నిర్వహించాలి. వారి అనుభవాలను తెలుసుకొని వాటి నుండి ప్రయోజనాన్ని పొందాలి.

ఒకవేళ ఏదేని ప్రాంతంలో ఒక్క జమాఅత్ కూడ చురుకుదనం తో పని చేస్తున్నచో, తమ కార్యనిర్వాహక మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పూర్తి స్థాయిలో పాల్గొంటున్నచో అట్టి జమాఅత్ విధి విధానాలను ఇతర పది జమాఅత్‌లకు పంపిణి చేసినచో వారికి కూడ ప్రయోజనాన్ని చేకూర్చగలవు. కాని ముఖ్య విషయమేమనగా, కేంద్ర వ్యవస్థలోని ప్రతి కార్యదర్శి మరియు పదవిదారులు మరియు శూరా ప్రతినిధులు తమ తమ బాధ్యతలను విశ్వాస భరితంగా ఆచరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

కొన్ని జమాఅత్‌లు లేదా కొన్ని దేశాలు కూడ ఈ విధంగా పర్యవేక్షణలు జరిపినవి. వాటి ద్వారా ప్రయోజనాలు చేకూరాయి. గత మూడు సంవత్సరాల క్రితం శూరాలో తీసుకున్న నిర్ణయాలను ఏ స్థాయి మేరకు ఆచరించడం జరిగింది. ఆచరిస్తున్నారు అని తెలుసు కోవాలి. వాటిని గూర్చి త్రైమాసిక నివేదికను కేంద్ర కార్యాలయానికి

పంపించాలి. అంతేగాని మేము ఈ అంశాన్ని గత మూడు సంవత్సరాల క్రితం ప్రవేశ పెట్టాము. కావున ఈ సంవత్సరం మరల ఇది ప్రవేశ పెట్టబడదు అని చెప్పి ఖాళీగా కూర్చోకుండా మేము ఆయా అంశాలను ఆచరిస్తూ ఈ స్థాయి మేరకు మేము మా లక్ష్యాన్ని చేరుకున్నాము, ఇంకా ప్రయత్నిస్తున్నాము అని కేంద్రానికి నివేదికలను పంపించాలి. ఇలా చేయడం వలన అలసత్వం వహించే జమాఅత్‌లు కూడ చురుకుగా పని చేయుటకు ముందుకు వస్తాయి. కేవలం మనం మాటలతో ప్రపంచాన్ని జయించలేము. అందుకోసం ఆచరించాలి, కృషి చేయాలి.

**క్రియాశీలకంగా పని చేయవలసిన అవసరం:**

ఎక్కడైతే పటిష్టమైన ప్రణాళిక అవసరం ఉన్నదో అక్కడ క్రీయాశీలత ఆవశ్యకత అధికంగా ఉంటుంది. తమ తమ ప్రార్థనల ప్రామాణికాన్ని పొందవలసిన అవసరమున్నది. ఒకవేళ పదవిదారులు మరియు శూరా ప్రతినిధులు తమ తమ ప్రార్థనల ప్రామాణికాలను మెరుగు పర్చుకొనుటకు కృషి చేసినచో, మస్జిద్‌లను జనావాసాలుగా తీర్చిదిద్దుటకు తమ నడవడికను ఆదర్శవంతంగా చూపినచో మస్జిద్‌లలో వచ్చేవారి సంఖ్య 3 నుండి 4 రెట్ల వరకు పెరుగుతుంది. ఇందుకోసం కూడ మనం పరిశీలనలు చేయాలి.

కావున తమ ఆచరణాత్మక నడవడిక, ప్రజలతో ప్రేమానురాగాల తో వ్యవహరించడం, వారి బాధలను మనస్సులో నింపుకోవడం, వారి కోసం తమ కోసం దుఆలు చేయడం, వర్తమాన ఖలీఫా పట్ల చూపించే విధేయత యొక్క ప్రామాణికమును పెంచుకోవడం వంటివి ప్రతి పదవిదారుని మరియు శూరా సభ్యుల ప్రత్యేక విశిష్టతై ఉండాలి. అప్పుడే ఒక విప్లవాత్మకమైన మార్పును సామూహికంగా జమాఅత్‌లో

తీసుకరావడంను చూడవచ్చును.

**హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అవతరణ ముఖ్యోద్దేశం:**

మనపై చాలా పెద్ద బాధ్యత ఉన్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణ యొక్క ముఖ్యోద్దేశం మరియు హుజూర్ అలైహిస్సలాం కార్యదీక్షత సాధారణ కార్యాచరణలు కావు. ప్రపంచానికి అందమైన ఇస్లాం బోధనలతో కూడిన సందేశాన్ని అందించి ప్రపంచాన్ని ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను ఆరాధించే విధంగా నిరంతరం కృషి చేయడానికి ప్రయత్నించాలి.

ప్రపంచంలోని అన్ని దేశాలలో శూరా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. మనం మన ఆచరణాత్మక స్థితిగతులను చక్కదిద్దుకోవడం కోసం ప్రణాళికలను రూపొందించుకుంటూ, ఏకేశ్వరుడైన అల్లాహ్ సందేశాన్ని అందించడం కోసం మరియు ప్రపంచాన్ని ఒకే సమాజంగా మార్చడం కోసం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పతాకం క్రిందికి తీసుకొని రావడం కోసం ఒక విప్లవాత్మక మార్పును తీసుకవచ్చే ప్రణాళికలను కూడ మనం రూపొందించుకోవాలి.

**తక్కువ ఖర్చులో ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించడం:**

ఈ కార్యక్రమాలన్నింటిని నెరవేర్చుటకు ఖర్చు చేయవలసిన అవసరం ఉంటుందనే విషయాన్ని కూడ ఎల్లప్పుడు గుర్తుంచుకోండి. కనుక ధనం కూడ అవసరముంటుంది. అందుకే తక్కువలో తక్కువగా ఖర్చుచేసి ఎక్కువలో ఎక్కువగా ప్రయోజనాలను పొందుటకు అనుగుణంగా కూడ ఆర్థిక ప్రణాళికలను ఏర్పాటు చేయాలి. జమాఅత్ అధిక సభ్యులు పేదవారు, మధ్య తరగతికి చెందినవారు. అందుకే

మన చందాల ఆదాయాన్ని దృష్టియందుంచుకొని తక్కువ ఖర్చుతో ఎక్కువ ధార్మిక ప్రచారానికి శ్రీకారం చుట్టుటకు మరియు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవాలి. మనం ఈ కార్యక్రమాల వాస్తవికతను అర్థం చేసుకున్నప్పుడే మనం ఈ కార్యక్రమాలను చేపట్టగలము. కావున మనం నిష్టాపరతను అవలంభిస్తూ మన బాధ్యతలను, మన న్యాసముల ను మనం చెల్లించాలి. ధార్మిక సేవను ఒక దైవానుగ్రహంగా భావించండి. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం నిష్టాపరతను అనుసరించాలని ఒక చోట తెల్పుతూ ఇలా అన్నారు.

''يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنْ تَتَّقُوا اللّٰهَ يَجْعَلْ لَّكُمْ فُرْقَانًا وَّيُكَفِّرْ عَنْكُمْ سَيِّاٰتِكُمْ

(అల్ అన్ఫాల్: 8/30)

وَيَجْعَلْ لَّكُمْ نُوْرًا تَمْشُوْنَ بِهٖ

(అల్ హదీద్: 57/29)

అనగా ఓ విశ్వాసులారా! ఒకవేళ మీరు నిష్టాపరులై నిలకడగా ఉన్న చో మరియు అల్లాహ్ తఆలా కొరకు నిష్టాపరత సుగుణాలను స్థాపించి, స్థిరత్వంను అవలంభించినచో అల్లాహ్ తఆలా మీకు మరియు మీ ప్రత్యర్థుల మధ్య ఒక స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపును. ఆ వ్యత్యాసం ఏమిటనగా మీకు ఒక తేజస్సును ఇవ్వడం జరుగుతుంది. ఆ తేజస్సుతో మీరు అన్ని మార్గాలలో నడుస్తుంటారు. అనగా ఆ తేజస్సు మీ అన్ని కార్యక్రమాలలో, సంభాషణలలో, శక్తి సామర్థ్యములలో నిండి ఉండును. మీ విజ్ఞతలో ఆ తేజస్సు కనిపించును, మీ నోటి నుండి వెలువడు ప్రతి

మాటలో ఆ తేజస్సు కనిపించును. మీ కన్నులలో కూడ ఆ తేజస్సు కనిపించును. మీ చెవులలో కూడ ఆ తేజస్సు కనిపించును. మీ నోటిలో మరియు మీ మాటలలో, మీ ప్రతి కదలికలో, మీ మౌనంలో కూడ ఆ తేజస్సు కనిపించును. మీరు నడుచునట్టి మార్గం కూడ తేజస్సుతో నిండియుండును. మొత్తానికి మీరు అనుసరించు మార్గాలన్నియు, మీ శక్తి సామర్థ్యపు మార్గాలన్నియు, మీ జ్ఞానేంద్రియా లన్నియు ఆ తేజస్సుతో నిండి యుండును. మీరు తల నుండి పాదాల వరకు తేజస్సుతో నిండి ఉంటారు."

(ఆయినా కమాలాతే ఇస్లాం, రూహాని ఖజాయిన్ సంపుటి 5, పుట 177-178)

నిష్ఠాపరతపై నడుస్తూ తమ తమ బాధ్యతలను నెరవేర్చు భాగ్యమును అల్లాహ్ తఆలా మనందరికి కల్గించుగాకా!. అల్లాహ్ తఆలా మన తప్పిదాలను , నిర్లక్ష్యాలను, బలహీనతలను దూరం చేయుగాక! తన అనుగ్రహాలను ఎల్లప్పుడు మనకు అనుగ్రహించుగాక!.

**in**

Telugu Language




# Majlis e Shura Ki Ahmiyat Aur Membaran e Shura Wa Uhdedarane Jama'at Ki Zimmadariyan

*By:*

*Office Majlis-e-shura Bharat*